ఏసీపీకి సన్మానం



గోల్కొండ: బోనాలతో పాటు ఇతర స్థానిక పండుగలు విజయవంతంగా నిర్వహించడంలో ప్రజల సహకారం ఎంతో ఉందని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల సందర్భంగా ఇప్పటి వరకు ఐదు పూజలు విజయవంతంగా ముగిసిన సందర్భంగా బుధవారం స్థానికులు గోల్కొండ కోట వద్ద ఆయనను సన్మానించారు.

ప్రత్యేక పూజలు



చాంద్రాయణగుట్ట: బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ సాంబ శివరావు సతీమణి ఉమాదేవి బుధవారం ఉప్పుగూడ మహంకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. పండ్లు, కూరగాయలతో శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆమెకు ఆశీర్వచనం చేయగా, కమిటీ అధ్యక్షుడు జనగామ మధుసూదన్ గౌడ్ సన్మానించారు.

బస్తీ దేవత.. మీరాలంమండి అమ్మవారు

నిజాం కాలం నుంచి అమ్మవారికి పూజలు
ఆషాఢంలో 9 రోజులు సామూహిక కుంకుమార్చన
ఈ నెల 28న అమ్మవారికి బంగారు బోనం

నిజాం కాలం నుంచి పూజలందుకుంటున్న మహంకాళేశ్వర అమ్మవారిని మీరాలంమండి భక్తులు 'బస్తీ దేవత'గా కొనియాడుతున్నారు. కేవలం బోనాల ఉత్సవాల్లో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా ఇక్కడి అమ్మవారిని భక్తులు పూజిస్తుంటారు. ఎల్లవేళలా భక్తుల కోరిన కోర్కెలు తీర్చే మీరాలంమండి అమ్మవారికి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి.

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో ప్రతి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. 1805లో మీరాలంమండి కూరగాయల మార్కెట్ ఏర్పడిన అనంతరం 1809లో ఇక్కడ అమ్మవారి ఆలయం నిర్మితమైంది. 2016లో ఆలయాన్ని భక్తుల సౌకర్యార్థం పునఃనిర్మించారు. విశాలమైన స్థలంలో భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు గల ఆలయంగా పాతబస్తీలో ప్రసిద్ధి చెందింది. మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో బుధవారం శాకంబరి పూజలు ఘనంగా జరిగాయి.

ప్రతిరోజూ రంగారెడ్డి జిల్లాలోని గ్రామాల నుంచి..

నిజాం కాలంలో హైదరాబాద్ నగర ప్రజలకు కూరగాయలు సరఫరా చేసే కేంద్రంగా మీరాలంమండి ప్రసిద్ధి చెందింది. అప్పట్లో నగర ప్రజలు కూరగాయలను మీరాలంమండి నుంచే ఖరీదు చేసేవారు. రంగారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ రైతులు తమ కూరగాయల పంటలను ఎడ్ల బండ్లపై మీరాలం మండికి తీసుకువచ్చేవారు.

రావిమొక్కను నాటి.. అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి..

మీరాలంమండికి కూరగాయలు తీసుకువచ్చిన రైతులు తమ ఎడ్ల బండ్లను 'బండిఖానా'లో నిలిపేవారు. ఇక్కడే రావిమొక్కను నాటి అక్కడే అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేయడం ప్రారంభించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు నిండుగా పండాలని, వ్యాపారాలు సక్రమంగా జరిగి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరుతూ రైతులు, స్థానిక వ్యాపారులు ఇక్కడ అమ్మవారికి పూజలు చేయడం ప్రారంభించారు.

రానురాను ఆషాఢ మాసం బోనాలుగా..

మహంకాళి అమ్మవారి పూజా కార్యక్రమాలు రానురాను ఆషాఢమాసం బోనాల జాతరగా రూపాంతరం చెందాయి. రైతులు ప్రారంభించిన ఈ పూజా కార్యక్రమాల అనంతరం 1960లో అమ్మవారి విగ్రహా ప్రతిష్ఠాపన చేసినప్పటి నుంచి ప్రతి ఆషాఢ మాసం మూడో బుధవారం రోజు అమ్మవారికి బోనం సమర్పించేవారు. అనంతరం ఆదివారం భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నారు. అప్పటి నుంచి ప్రతి ఆషాఢ మాసంలో బోనాల జాతర ఉత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తున్నారు.



మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం



28న అమ్మవారికి బంగారు బోనం..



ఈనెల 28న మీరాలంమండి మహంకాళేశ్వర అమ్మవారికి బంగారు పాత్రలో బోనం సమర్పించనున్నాం. ఈసారి బోనాల ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 29న పాతబస్తీలోని చార్మినార్ ప్రధాన వీధుల్లో నిర్వహించే అమ్మవారి సామూహిక ఘటాల ఊరేగింపులో తమ ఆలయానికి చెందిన అమ్మవారి ఘటాన్ని వైభవంగా ఊరేగింపు నిర్వహిస్తాం.

– గాజుల అంజయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు

విద్యారంగంలో తెలంగాణ టాప్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గోల్కొండ: సాంకేతిక విద్యా రంగంలో తెలంగాణ దేశంలోనే టాప్ అని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.వెంకటరమణ అన్నారు. బుధవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల హ్యూమానిటీస్ మేనేజ్‌మెంట్ సైన్స్ అండ్ టెక్నాలజీపై అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వివిధ రంగాలకు చెందిన పరిశోధకులు, నిపుణులు తమ పరిశోధన ఫలితాలను ఒకే వేదికపై ఇతరులతో పంచుకోవడం ఒక గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అండిఅత్రీఫాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మకత్తర్, జీఎన్ఐటీఎస్ చైర్మన్ సి.రాఘవరెడ్డి, వైస్ చైర్మన్ శ్రీవిద్యారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, డాక్టర్ మాధవీలత పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పట్టడం ఖాయం'



గోల్కొండ: పదేళ్ల రాష్ట్రాన్ని పాలించి ప్రజాధనాన్ని దోచుకున్న మాజీ సీఎం కేసీఆర్ పార్టీకి పట్టిన గతే కాంగ్రెస్‌కు పట్టడం ఖాయమని బీజేపీ కిసాన్‌మోర్చా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్‌లో బీజేపీ కిసాన్‌మోర్చా నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుల పట్ల కక్ష కట్టినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. సాధ్యం కానీ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీ నైజమన్నారు. నాయకులు ప్రభుపూజారి, నామా యాదగిరి నేత, వెంకటేష్‌సాగర్ తదితరులున్నారు.

ఆలయాలకు ఆర్థిక సాయాన్ని మరింత పెంచాలి


మంత్రికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

చార్మినార్: హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయంలో జరిగే బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని కోరామని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్ ప్రవీణ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఆలయ కమిటీ అధ్యక్షుడు అనంతోజ్ రాజేష్‌తో పాటు ఊరేగింపు కమిటీ మాజీ కార్యదర్శి బుల్లెట్ శ్రీధర్, నగర గౌడ సంఘం అధ్యక్షుడు దేవేందర్ గౌడ్ తదితరుల బృందం మంత్రిని కలిసి సత్కరించిన అనంతరం ఆహ్వాన పత్రం అందజేశామన్నారు. అలాగే పాతబస్తీలోని ఆలయాలకు అందుతున్న ఆర్థిక సాయాన్ని ఈ ఏడాది పెంచాల్సిన అవసరం ఉందనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకు వచ్చామన్నారు.

కోట మైసమ్మ ఆలయంలో పూజలు



గౌలిపురా: మహంకాళి మాతేశ్వరి భరత మాత ఆలయం, కోట మైసమ్మ ఆలయంలో అమ్మవారిని శాకంబరి అలంకరణ చేశారు. అనంతరం ఆలయ కమిటీ కార్య నిర్వాహక, సంస్కృతిక కార్యదర్శి అల్లి శివచంద్రగిరి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, ముఖ్య సలహాదారులు ఎస్.మల్లేషం గౌడ్, ఉపాధ్యక్షుడు ఎం.రమేష్, జానకీరామ్, వై.రామకృష్ణ, బి.వై.శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

దూద్ బౌలి: అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్–9 టౌన్ ప్లానింగ్ ఏసీపీ కుర్షుస్ అన్నారు. అలిజా కోట్లాలోని ఒక అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. కోర్టు ఆదేశాల మేరకే తాము అలిజా కోట్లలో భవనాన్ని కూల్చివేశామని ఏసీపీ కుర్షుస్ తెలిపారు. భవన నిర్మాణానికి అనుమతులు తప్పనిసరి అని.. నిబంధనల ప్రకారమే భవనాన్ని నిర్మించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మీర్ చౌక్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సెక్షన్ ఆఫీసర్ నరేష్ యోగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ ఆలయంలో కుంకుమార్చన

గౌలిపురా: సీఐబీ క్వార్టర్స్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాల్లో భాగంగా సహస్ర కుంకుమార్చన కార్యక్రమాన్ని రాంమూర్తి, రమాదేవి దంపతులు, చంద్రశేఖర్, ఎస్.రాణి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆదర్ల మహేష్, కమిటీ ప్రతినిధులు కొడి సురేందర్, బ్రహ్మానందం, దేవేందర్, దయానంద్, హేమంత్, భానుప్రకాశ్ పాల్గొన్నారు.




బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన సాన్వి



గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో అండర్–11 బాలికల సింగిల్స్ విభాగంలో సాన్వి లట్టాల అద్భుతమైన ఆటతీరుతో స్టేట్ టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. ఈ మేరకు బుధవారం ఇండోర్ స్టేడియంలో ఆమెను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా మ్యాచ్ పాయింట్ బాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకులు, కోచ్ ముప్పాల వేణు మాట్లాడుతూ..అండర్–11, అండర్–13 విభాగాల్లో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లకు అర్హత సాధించడం అభినందనీయమన్నారు. బాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాగర్, కోచ్‌లు విద్యాధర్, బీవీఎస్‌కే లింగేశ్వర్ పాల్గొన్నారు.


వైభవంగా శాకంబరి పూజలు


శాకంబరిగా లాల్‌దర్వాజా మహంకాళి


బేలా మాతేశ్వరి ముత్యాలమ్మ


మీరాలంమండి మహంకాళేశ్వర అమ్మవారు

చార్మినార్/చాంద్రాయణగుట్ట/గౌలిపురా: బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం పాతబస్తీలోని పలు అమ్మవారి ఆలయాల్లో శాకంబరి పూజలు వైభవంగా జరిగాయి. వివిధ రకాల కూరగాయలతో ఆలయంతో పాటు అమ్మవారి విగ్రహాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. మీరాలంమండిలోని మహంకాళేశ్వర ఆలయంలో దాదాపు 100 క్వింటాళ్ల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారి గర్భగుడి, విగ్రహం, శివ లింగంలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. బేలా మాతేశ్వరి ముత్యాలమ్మ ఆలయం, లాల్‌దర్వాజాలోని సింహవాహిని మహంకాళి ఆలయం, ఉప్పుగూడ మహంకాళి ఆలయాల్లో శాకంబరి పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.


ఉప్పుగూడ మహంకాళి అమ్మవారు


భరతమాత ఆలయంలో అమ్మవారు


శాకంబరి అలంకరణలో శివలింగం

మేరు కులస్తులకు ప్రాధాన్యమివ్వాలి


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన పోల్కం శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: మేరు కులస్తులకు ప్రాధాన్యమివ్వాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షుడు, టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ, రాజ్యసభ స్థానాలను మేరు కులస్తులకు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బుధవారం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి మెమోరాండం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో 20 లక్షలకు పైగా ఉన్న మేరు కులస్తులంతా కాంగ్రెస్ పార్టీ గెలుపులో కీలక పాత్ర వహించారన్నారు. నామినేటెడ్ పదవులు అప్పగించి మేరు కులస్తులను ఆదుకోవాలన్నారు. ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్, గంగాపురం దశరథ్, రాహుల్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు


వేడుకల్లో నిర్మల నీలకంఠం గౌడ్ తదితరులు

జియాగూడ: బోనాలను ఘనంగా నిర్వహించామని పూలెకోన గీతాపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొత్త నవీన్ కుమార్ గౌడ్, నిర్మల నీలకంఠం గౌడ్ తెలిపారు. బుధవారం పురానాపూల్‌లోని సహకార సంఘంలో గల మతేశ్వరీకి ప్రత్యేక అలంకరణ, పూజలు, తొట్టెల, బోనాలు, పోతరాజుల విన్యాసాలతో సమర్పించారు. ఉపాధ్యక్షులు బుర్రా భాస్కర్ గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, మాణిక్యం గౌడ్, నిర్మల ప్రవీన్‌గౌడ్, బి అశోక్‌గౌడ్, ఏ.శ్రీనివాస్ గౌడ్, మధుగౌడ్, కె శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

కనుల పండువగా చక్రస్నానం



అఫ్జల్‌గంజ్: విఠోభ ఆలయంలో బుధవారం స్వామివారి చక్రస్నానం, అన్నప్రసాదం, పూజా వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులతో ఆలయం కిక్కిరిసి పోయింది. స్వామివారిని ఊరేగిస్తూ పలు భక్తిగీతాలు పాడారు.

స్ట్రీట్ సర్వేల పేరిట వేధింపులు

- వాణిజ్య పన్నుల శాఖలో ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించని కింది స్థాయి అధికారులు
- చెప్పేది ఒకటి..చేసేది ఒకటి
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు



వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కార్యాలయం

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖలో స్ట్రీట్ సర్వేల పేరిట వ్యాపారులను వేధిస్తున్నారు. స్ట్రీట్ సర్వే అంటూ అధికారుల బృందాలు వ్యాపార కేంద్రాలకు వచ్చి వ్యాపారులను వేధిస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్ట్రీట్ సర్వే ప్రకారం.. ఏదైనా వ్యాపార దుకాణాల దగ్గరకు వచ్చి వాణిజ్య పన్నుల అధికారులు దుకాణదారులకు జీఎస్టీ లైసెన్స్ ఉందా లేదా అని వివరాలు తెలుసుకోవాలి. ఏ వ్యాపారి దగ్గరికి అయినా అధికారులు వచ్చినప్పుడు జీఎస్టీ రిజిస్ట్రేషన్ అయ్యిందా లేదా సర్వే చేసుకుని వెళ్లాలి. కానీ కొంత మంది వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఉన్నతాధికారుల నిబంధనలకు వ్యతిరేకంగా వ్యాపారులను వేధిస్తున్నారు. దుకాణాల లోపలికి వెళ్లి పేపర్లను తనిఖీ చేస్తున్నారు. దుకాణాల లోపల స్టాక్‌ల గురించి వివరాలు అడుగుతున్నారు. ఇలా ఏవైనా పేపర్లు లేనిచో వ్యాపారుల వద్ద పెద్ద ఎత్తున డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ లేని వ్యాపారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

వీటీసీ పేరుతో..

వీటీసీ (వెహికీల్ ట్రాఫిక్ చెకింగ్) పేరుతో వ్యాపారుల వద్దకు వచ్చి వాణిజ్య పన్నుల శాఖ అధికారులు నానా హైరానా చేస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖ నిబంధనల ప్రకారం..వీటీసీ కేవలం రోడ్లపైనే వాహనాలను తనిఖీ చేయాలి. అధికారులు మాత్రం విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. వ్యాపార కేంద్రాలపై దాడులు చేసి వీటీసీ పేరుతో ఇష్టం వచ్చినట్లు దండుకుంటున్నారు. అదేవిధంగా ఎవరైనా వ్యాపారి దుకాణం ముందు సామగ్రి లోడింగ్ చేస్తుంటే వేబిల్ లేవని అధికారులు వేధిస్తున్నారు. నిబంధనల ప్రకారం .. వాహనం లోడ్ అయిన తర్వాతనే వేబిల్ తయారు చేస్తారు. ముందుగానే కొంత మంది అధికారులు లోడింగ్ అవుతున్న వాహనాలపై దాడులు చేస్తూ వేధిస్తున్నట్లు సర్వత్ర వ్యాపారులు పేర్కొంటున్నారు. వే బిల్లుల్లో ఏదైనా పొరపాటు ఉన్నా, వే బిల్లు లోపల వాహనాల నెంబర్లు 1 లేదా 2 తప్పు పడినచో అధికారులు మాత్రం వ్యాపారుల వద్ద పెద్ద ఎత్తున డబ్బులు వసూళ్లు చేస్తున్నారు.

అధికారులు విధుల్లోకి రాకుండానే తనిఖీలు..

కొంతమంది వాణిజ్య పన్నుల శాఖ అధికారులు విధుల్లోకి రాకున్నా కూడా తనిఖీలు చేస్తున్నారు. రోడ్లపై వాహనాలను ఆపి తామే అధికారులమంటూ వేధింపులకు పాల్పడుతున్నారు. వ్యాపారుల వద్ద వే బిల్లులు ఉన్నప్పటికీ వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మాత్రం ఇది 2వ ట్రిప్పు, 3వ ట్రిప్పు అంటూ వ్యాపారులను వేధిస్తున్నట్లు పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. కొంతమంది వ్యాపారులు జెన్యూన్‌గా వే బిల్లు తీసుకుని వాహనం వెంట వెళ్తుండగా అధికారులు మాత్రం ఆ వాహనాలను ఆపి తనిఖీలు చేస్తూ వారిని బెదిరిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

వీటీసీలలో వేలాది రూపాయల ఖర్చులు ఎవరివి..?

వీటీసీల పేరుతో వాహనాల తనిఖీలు చేస్తున్న అధికారులకు ఒక్కరోజు తనిఖీలు చేశారంటే వేల రూపాయల ఖర్చులు వస్తాయి. ప్రైవేటు వ్యక్తులు, అటెండర్లు, డ్రైవర్లు, పెట్రోల్, డీజిల్, లంచ్ డిన్నర్ల ఖర్చు రూ.10 వేల నుంచి రూ.20 వేలు వస్తుందని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. ఇలా ఖర్చు మొత్తం వాణిజ్య పన్నుల శాఖ చెల్లించదు. ఈ ఖర్చులంతా వ్యాపారుల వద్ద వేధించిన డబ్బే అని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా కొన్ని నెలల క్రితం పెద్ద ఎత్తున ఏసీబీ అధికారులు తనిఖీలు చేస్తున్న ప్రాంతాల్లో దాడులు నిర్వహించి వారు కూడా తనిఖీలు చేశారు. కాగా తరచూ ఏసీబీ అధికారులు నిరంతరం తనిఖీలు చేసే ప్రాంతాలపై నిఘా ఉంచాలని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు


వేడుకల్లో గోపాల్‌జీ, సత్యనారాయణ


బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు

అబిడ్స్: గోషామహల్‌లో బోనాల వేడుకలు జోరుగా నిర్వహించారు. గోషామహల్, చందన్‌వాడి, కోల్సివాడి, హిందీనగర్, చాక్నవాడి, ఏడు గుళ్లు, ఐదు గుళ్ల ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచే వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మహిళలు ఆలయాల్లో బోనాలు సమర్పించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర బీజేపీ కార్యాలయ కో ఆర్డినేటర్ డి.గోపాల్‌జీ, పూజారి సత్యనారాయణ, సాయికుమార్, హ్యూమన్ రైట్స్ గోషామహల్ నియోజకవర్గం ఉపాధ్యక్షురాలు ఎం.వాసవి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా గోషామహల్ భైరవి మాత ఆలయంలో కాంగ్రెస్ నాయకుడు అర్జున్‌లాల్ యాదవ్ భగత్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

అప్పు చెల్లించలేదని వ్యక్తిపై కత్తితో దాడి

సుల్తాన్‌బజార్: రూ.500 అప్పును చెల్లించలేదని కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిని సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి తెలిపిన వివరాల ప్రకారం..మహారాష్ట్రకు చెందిన సత్తార్ రజాక్ అగ్బాని (38) నాంపల్లిలోని ఆగాపూర్‌లో నివాసం ఉంటాడు. కాస్మటిక్ వ్యాపారం చేసే అతను ఉప్పల్ ఫిర్దోజిగూడకు చెందిన రాజ్‌గోపాల్ అలియాస్ నానికి రూ.500 అప్పు ఇచ్చాడు. తాను ఇచ్చి రూ.500 చెల్లించాలని అడగడంతో తాను ఇవ్వలేనని చెప్పాడు. దీంతో కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లోని ఎస్‌వీ వైన్స్‌లోని 2వ ఫ్లోర్‌లో ఇద్దరు మద్యం సేవించారు. డబ్బుల మధ్య వాగ్వివాదం కావడంతో కోపోద్రిక్తుడైన సత్తార్ పేపర్ కటింగ్ కత్తితో ఎడమ చాతిపై పొడిచాడు. అంతటితో ఆగకుండా చేతిపై కూడా పొడవడంతో బాధితుడు అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సత్తార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఎస్ఐ మధుసూధన్ దర్యాప్తు చేస్తున్నారు.

లాల్‌దర్వాజా బోనాలకు స్పెషల్ బస్సులు నడపాలి

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలకు రావాలని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ.సజ్జనార్‌ను ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేష్ ఆహ్వానించారు. ఎంతో వైభవంగా జరిగే బోనాలను వీక్షించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం 'లాల్‌దర్వాజా బోనాల జాతర స్పెషల్'పేరుతో నగరంలోని అన్ని డిపోల నుంచి రేపటి నుంచి సోమవారం వరకు నడపాలని వినతి పత్రాన్ని అందజేశారు. బస్సులను నడపడంతో పాటు బోనాల జాతరకు వస్తానని ఆయన తెలిపారన్నారు.

మీరాలం సబ్ డివిజన్‌లో మ్యాపింగ్ సర్వే పూర్తి


వెంకటేశ్ గౌడ్

శాలిబండ: మీరాలం సబ్ డివిజన్‌లో మొత్తం 11కేవీ 65 ఫీడర్లలో మ్యాపింగ్ సర్వేను పూర్తి చేసినట్లు టీజీఎస్‌పీడీసీఎల్ మీరాలం సబ్ డివిజన్ ఆపరేషన్స్ ఏడీఈ కె.వెంకటేశ్ గౌడ్ తెలిపారు. మీరాలం సెక్షన్‌లో 26 ఫీడర్లు, చందులాల్ బారాదరి సెక్షన్‌లో 18 ఫీడర్లు, కిషన్‌బాగ్ సెక్షన్‌లో 12 ఫీడర్లు, అత్తాపూర్ సెక్షన్‌లో 9 ఫీడర్లలో సర్వేను పూర్తి చేశామన్నారు. అన్ని ఫీడర్లలో మైనర్, మేజర్, లూస్ లైన్స్, ఏబీ స్విచ్ వర్కింగ్‌లో ఉందా..లేదా, చెట్టు కొమ్మలు దగ్గరగా ఉన్న ఏరియా లోకేషన్, జీపీఆర్ఎస్ లోకేషన్స్ అన్నింటిని టీజీఏఐఎంఎస్ యాప్‌లో పొందుపరిచామన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన బోరబండ–హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ల మధ్యలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సుమారు 30 ఏళ్ల వయస్సు గల ఓ యువకుడు బుధవారం బోరబండ–హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన ఓ రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి ఒంటిపై బూడిదరంగు జీన్స్ ప్యాంటు, ఆకుపచ్చ రంగు చొక్కా ధరించినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.